కార్యకర్తలను కాపాడుకుంటాం : మధుయాష్కీ



వనస్థలిపురంలో నాయకులతో సమావేశమైన మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలను కాపాడుకుంటామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన ప్రచారం, బూత్ కమిటీల ఏర్పాటు తదితర విషయాలపై డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో శనివారం వనస్థలిపురం కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, ఈ నెల 16న మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తారని, అందుకు తగ్గట్టుగా డివిజన్లలో ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. సమావేశంలో నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, ఎస్వీ కృష్ణప్రసాద్, చలకాని వెంకట్, లింగాల నాగేశ్వర్‌రావు, మకుటం సదాశివుడు, కుట్ల నరసింహయాదవ్, సురేందర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య సమాలోచన సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

హయత్‌నగర్: సృజన సాహితీ ఆధ్వర్యంలో ఈ నెల 14న నల్లగొండలో జరిగే ఏనుగు నర్సింహారెడ్డి సాహిత్య సమాలోచన సదస్సు పోస్టర్‌ను శనివారం హయత్‌నగర్‌లోని భవిష్య జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరిమల సాహితీ అకాడమీ అధ్యక్షుడు మండల స్వామి మాట్లాడుతూ...కవిత్వం, కథ, నవల, శతకం, పద్యం, విమర్శ, అనువాదం తదితర సాహిత్య రంగంలో ఏనుగు నర్సింహారెడ్డి గత 30 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారని, వారి ప్రతిభకు ప్రతీకగా ఈ సదస్సు నిలుస్తుందని తెలిపారు .పరిమల సాహితీ ప్రధాన కార్యదర్శి నకిరెకంటి శీనయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏరూషి నర్సింహ, భవిష్య కళాశాల ప్రిన్సిపల్ జానయ్య, బాసరాజు యాదగిరి, కంచి రవికుమార్, శెట్టి గణేష్‌గౌడ్, గడ్డం శీనయ్య, పరమేష్, సైదులుగౌడ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనుమతి లేకుండా సమావేశం.. వ్యక్తిపై కేసు నమోదు

చైతన్యపురి: ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఎన్నికల సమావేశం నిర్వహించినందుకు ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..శనివారం కొత్తపేటలో స్పైసి హబ్ హోటల్‌లో బ్రాహ్మణ సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ మాల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఈ సమావేశం నిర్వహించడటంతో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, చైతన్యపురి పోలీసులు స్పైసి హబ్ హోటల్ వద్దకు వెళ్లి నోటీసులు జారీ చేశారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమావేశం నిర్వహించిన సతీష్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ప్రజా సంక్షేమాన్ని విస్మరించి గారడీ మాటలతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ముందుకు వస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్, నాగోలు, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం శనివారం మన్సూరాబాద్ ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, ఎగ్గే మల్లేశం, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలైనా అసెంబ్లీ ఎన్నికల హామీలను నేరవేర్చలేకపోయిందని ఆరోపించారు. కరెంటు, నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వంలో చలనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేస్తారన్నారు. స్థానికుడు, ప్రజలకు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకుని, కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, చెరకు సంగీతప్రశాంత్‌గౌడ్, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్ రెడ్డి, నాయకులు అనంతుల రాజిరెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, రవి, అరవింద్‌రెడ్డి, చిరంజీవి, కొసనం ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజేశ్‌కు 'జాతీయ సేవా రత్న' అవార్డు ప్రదానం

దిల్‌సుఖ్‌నగర్: హైదరాబాద్‌కు చెందిన యువ ఆర్ట్ థియేటర్స్ 20 వసంతాల మహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు చిక్కడపల్లిలోని త్యాగరాజ గానసభలో శుక్రవారం జరిగాయి. ఈ వేడుకల్లో తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాలలో సేవలందిస్తున్న ప్రముఖులను జాతీయ సేవా రత్న అవార్డులతో సత్కరించారు. ఇందులో భాగంగా కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ మంత్రి పుష్పలీల చేతుల మీదుగా ఎల్‌బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్‌కు సేవారత్న పురస్కారం ప్రదానం చేశారు. యువ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు వెంకటరమణ, జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షుడు మందడి కృష్ణారెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త, సమాజ సేవకుడు డా.చిల్లా రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ధ్యానాంజనేయుడి సేవలో దేవాదాయశాఖ కమిషనర్



హన్మంతరావు కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని శ్రీధ్యానాంజనేయ స్వామివారిని శనివారం రాత్రి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, దేవాదాయశాఖ కమిషనర్ మంత్రి ప్రగడ హన్మంతరావు శనివారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు, పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోశ్చరణలతో హన్మంతరావు కుటుంబ సభ్యులను వేద పండితులు ఆశీర్వదించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో హన్మంతరావు సతీమణి స్రవంతి, మాతృమూర్తి ప్రమీలాదేవి, కుటుంబ సభ్యులు విజయలక్ష్మి, అనురాధ, కీర్తన్, కొండ యాదగిరి ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ, అర్చకులు ప్రవీణ్‌శర్మ పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరం

నాగోలు: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని రాష్ట్ర టూరిజం శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మదర్ థెరిస్సా ఆశ్రయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆశ్రయ ఫౌండేషన్ వారు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఇలాంటి చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా ఆశ్రయ ఫౌండేషన్ అధ్యక్షుడు సి.దత్తయ్య, ప్రధాన కార్యదర్శి అనపూసల రామస్వామి, సభ్యులు మధు, దుర్గాప్రసాద్, మహేందర్ గౌడ్, ఎస్.వెంకటేష్, రోహిత్, కేశవులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ ఎస్సీ సెల్ చైర్మన్



సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జోగు రాములు

నాగోలు: బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మన్ జోగు రాములు ఇతర నాయకులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జోగు రాములు మాట్లాడుతూ, అనేక సంవత్సరాల నుంచి బీఆర్ఎస్ పార్టీలో పనిచేస్తున్న తనకు పార్టీ తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. మల్కాజిగిరిలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని అన్నారు.

తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు



ఇటికల వెంకటేశ్వర్లు (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపాడో వంటమనిషి. వివరాల్లోకి వెళితే... నల్లగొండ జిల్లా నూతనకల్ మండలం అలుగూరు గ్రామానికి చెందిన ఇటికల వెంకటేశ్వర్లు (35) వంటమనిషిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 9న బైక్‌పై వెళ్తూ ఒక్కసారిగా కింద పడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అత్యవసర చికిత్స అందించారు. చికిత్సకు స్పందించక పోవడంతో ఈనెల 11న సాయంత్రం బ్రెయిన్‌డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు భార్య బిక్కి వోహకు అవయవదానంపై అవగాహన కల్పించారు. అవయవదానానికి కుటుంబ సభ్యులు అంగీకరించడంతో శుక్రవారం వెంకటేశ్వర్లు శరీరం నుంచి కిడ్నీలు, లివర్, కళ్ల కార్నియాలను వైద్యులు సేకరించారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆమె ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్, ఇతర ప్రాంతాలలో రంజిత్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. గడపగడపకు తిరుగుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డు హామీలను ప్రజలకు తెలియజేస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారం కృషి చేసే వ్యక్తి రంజిత్‌రెడ్డి అన్నారు. కరోనా సమయంలో తన సొంత డబ్బులతో ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే రంజిత్‌రెడ్డి మరోసారి గెలిపించాలని కోరారు. మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ నందిగామ నర్సింహ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా గణేష్ నేత, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు బొద్దుపల్లి మహేందర్, రమేష్ నేత, యాదయ్య, లింగస్వామి గౌడ్, పగడాల ఎల్లయ్య, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌కేపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సీతారంజిత్ రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

సీఎంకు న్యాయవాది రాపోలు భాస్కర్ వినతి



సమావేశంలో మాట్లాడుతున్న రాపోలు భాస్కర్

సైదాబాద్: కేంద్ర ప్రభుత్వం 2016లో రూపొందించిన వికలాంగుల హక్కుల చట్టాన్ని తెలంగాణలో పకడ్బందీగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం పంపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన సైదాబాద్ డివిజన్ కల్యాణ్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణలో 21 రకాల వికలాంగత్వాలతో 20 లక్షల మంది వికలాంగులు పలు రకాల ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పలు సందర్భాలలో బాధితులైన వికలాంగులు న్యాయం కోసం పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం వారికి ప్రభుత్వం ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్లను వర్తింపచేయాలన్నారు. వికలాంగుల హక్కుల చట్టం నిర్ణయించిన మేరకు వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సమావేశంలో వికలాంగుల సంఘాల నెట్‌వర్క్ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ బైక్ ర్యాలీ

లింగోజిగూడ: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని ఆ పార్టీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు సరూర్‌నగర్ చెరువు కట్ట వద్ద ర్యాలీ మొదలై సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, సాగర్ రింగ్ రోడ్డు, ఎల్‌బీనగర్ మీదుగా ఎల్‌బీనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. బైక్ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాజశేఖర్‌రెడ్డి కోరారు.

సొంతగూటికి రామ్మోహన్‌గౌడ్ దంపతులు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న రామ్మోహన్‌గౌడ్,లక్ష్మీప్రసన్న తదితరులు

వనస్థలిపురం: బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, ఆయన సతీమణి, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న శనివారం తమ సొంత పార్టీ కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో తమ అనుచరులతో కలిసి వారు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

తిరుమల దర్శనం టికెట్లు ఇప్పిస్తానని టోకరా

రూ.1.60 లక్షలు కాజేసిన కేటుగాడు

నాగోలు: తిరుమల శ్రీవారి దర్శనం టికెట్లు ఇస్తానని నమ్మించి ఓ వ్యక్తి వద్ద డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ ఘటన ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఎల్‌బీనగర్ బైరామల్‌గూడ పాత విలేజ్‌కు చెందిన గజ్జల కపిల్‌కుమార్ రెడ్డిని చరణ్ అనే వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. తాను టీటీడీ చైర్మన్ పీఏనని, తిరుమల శ్రీవారి దర్శనం టికెట్లను బుక్ చేస్తానని తెలిపాడు. ఇది నమ్మిన కపిల్‌కుమార్ రెడ్డి శ్రీవారి దర్శనం కోసం ఈ నెల 7వ తేదీన చరణ్‌కు రూ.1,60,900 ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశాడు. అప్పటి నుంచి టికెట్ల కోసం చరణ్‌కు ఫోన్ చేయగా సమాధానం ఇవ్వడం లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన కపిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23 నుంచి భగవద్గీత పఠన శిక్షణ శిబిరం

వనస్థలిపురం: వేసవి సెలవులను పురస్కరించుకుని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, వనస్థలిపురం భక్త సమాజం సంయుక్త ఆధ్వర్యంలో 14 సంవత్సరాలు పైబడిన బాల బాలికల కోసం భగవద్గీత పఠన శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సీహెచ్‌వీఆర్‌కే మూర్తి తెలిపారు. ఈ నెల 23 నుంచి మే 9 వరకు వనస్థలిపురం సచివాలయనగర్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అన్నమరాజు ప్రభాకరరావు ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల చిన్నారులు ఈ నెల 20 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు ఫోన్ నం. 7801001166లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మజ్జిగ పంపిణీ

చంచల్‌గూడ: కుర్మగూడ హనుమాన్ ఆలయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. మండుతు న్న ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రతి శనివారం మజ్జిగ పంపిణీ చే’స్తున్నామని, వేసవి కాలం ముగిసే వరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తా మని కమిటీ అధ్యక్షుడు సహదేవ్‌యాదవ్ తెలిపారు. మాణిక్ ప్రభు, సత్యనారాయణ పాల్గొన్నారు.